# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **భారత్, చైనా మధ్య స్థిరమైన, శాంతియుత సంబంధాలు ఈ ప్రాంతానికే కాక... ప్రపంచానికీ కీలకమేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

**2.** **ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల కరపత్రాలు, పోస్టర్లు, హోర్డింగ్‌లలో తప్పనిసరిగా ప్రింటర్, ప్రచురణకర్తల వివరాలు ముద్రించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.**

**3.** **ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏపీపీఎస్సీ గ్రూపు-2 ప్రిలిమ్స్ ఫలితాలను ప్రకటించింది.**

**4.** **క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనలకు ప్రతీకగా నిలిచే రంజాన్...ఈద్- ఉల్-ఫితర్ పండుగను ముస్లిం సోదరులు ఈరోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.**

**5.** **ప్రముఖ సంఘసంస్కర్త మహాత్మా జ్యోతీరావు పూలే జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

తెలంగాణలో ఈరోజు, రేపు ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నిన్న తెలిపింది. కొన్ని జిల్లాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కాగా పలు జిల్లాల్లో నిన్న జల్లులు కురిశాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 41.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. నల్గొండ జిల్లా మాడుగులపల్లిలో 41.1, వనపర్తి జిల్లా కొత్తకోటలో 41.1, జయశంకర్ భూపాలపల్లి జిల్లా రోగొండలో 41, ములుగు జిల్లా తాడ్వాయిలో 41, మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలో 40.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

--------------------------

వేసవి ప్రత్యేక రద్దీ నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి పశ్చిమ బెంగాల్‌లోని షాలిమార్, సంత్రగాచ్చిలకు.. కేరళలోని కొల్లంకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ మేరకు బుధవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేసింది. సికింద్రాబాద్-సంత్రగాచ్చి రైలు ప్రతి శుక్రవారం సికింద్రాబాద్ నుంచి బయలు దేరుతుంది. ఏప్రిల్ 19వ తేదీ నుంచి జూన్ 28వ తేదీ వరకు 11 ట్రిప్పులు వెళుతుంది. ప్రతి శనివారం తిరుగుప్రయాణమయ్యే సాంత్రాగాఛి-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 20వ తేదీ నుంచి జూన్ 29వ తేదీ వరకు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. ఈ రైళ్ళు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, దువ్వాడ, విజయనగరం, భువనేశ్వర్, కటక్, ఖరగ్‌పుర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

--------------------------

భారత సామాజిక విప్లవ ఉద్యమపితామహుడు, ప్రముఖ సంఘసంస్కర్త మహాత్మా జ్యోతీరావ్‌ఫూలే జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం. సమాజంలో వెనుకబడిన వర్గ ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి హక్కుల కోసం పోరాడి, సాధికారతకు కృషిచేసిన జ్యోతీరావ్‌ఫూలే 1827 ఏప్రిల్ 11వ తేదీన మహారాష్ట్రలోని పూణేజిల్లా ఖానవలిలో జన్మించారు. తన జీవితాన్ని బలహీన వర్గాల సంక్షేమానికి అంకితం చేసిన ఫూలే, 1890 నవంబర్ 28న పూణేలో మరణించారు. నవసమాజ స్థాపనకు ఆ మహనీయుడు చేసిన సేవలను స్మరించుకుంటూ ఈ రోజు దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రపంచ శాంతిని, ప్రజల శ్రేయస్సును కాంక్షించే పవిత్ర రంజాన్ సందర్భంగా ముస్లింలందరికీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ దన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

ముస్లింలు అత్యంత పవిత్రంగా పాటించిన రంజాన్ మాస ఉపవాస దీక్షలు బుధవారం రాత్రి ఆకాశంలో నెలవంక కనిపించడంతో ముగిశాయి. చాంద్ ముబారక్.. అంటూ ముస్లిం సోదరులు శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఈద్ ఉల్ ఫితర్ ను గురువారం జరుపుకోవాలని... రంజాన్ మాస ఉపవాస దీక్షలు ముగిశాయని హైదరాబాద్ మక్కా మసీదు సూపరింటెండెంట్ ఎం.ఎ.ఖదీర్ సిద్దీఖ్, మర్కజీ రూయెత్ ఏ హిలాల్ కమిటీ ప్రతినిధి మౌలానా ముఫ్తీ ఖలీల్ అహ్మద్ తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏపీపీఎస్సీ నిన్న గ్రూపు-2 ప్రిలిమ్స్ ఫలితాలను ప్రకటించింది. రాష్ట్రంలో మొత్తం 899 గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి డిసెంబర్ 21వ తేదీ నుంచి జనవరి 17వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించిన ఏపీపీఎస్సీ.. ఫిబ్రవరి 25వ తేదీన ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించింది. జులై 28వ తేదీన జరిగే ప్రధాన పరీక్ష రాసేందుకు 92 వేల 250 మందికి అవకాశాన్ని కల్పించింది. ఒక్కొక్క పోస్టుకు 100 మంది చొప్పున ఎంపిక చేసింది. ప్రిలిమ్స్‌లో పలువురు అభ్యర్థులకు మార్కులు సమానంగా వచ్చాయి. దీనివల్ల ప్రధాన పరీక్ష రాసేవారి సంఖ్య పెరిగింది.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకుల ద్వారా ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని చమురు పరిశ్రమల ప్రతినిధులను ఆంధ్రప్రదేశ్ ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కోరారు. నిన్న ఆయన ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో హెచ్‌పిసిఎల్, ఐఒసిఎల్, బిపిసిఎల్ చమురు పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమై ఓటర్ల అవగాహనా కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం కార్యక్రమం అమలులో భాగంగా ఓటర్ల అవగాహనా కార్యక్రమాలను చమురు పరిశ్రమల ద్వారా నిర్వహించాలని భారత ఎన్నికల సంఘం ఆదేశించినట్లు తెలిపారు. ఓటు హక్కు విలువను తెలిజేసే నినాదాలతో హోర్డింగుల డిజైన్లను అందజేస్తామని.. వాటిని వినియోగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని

పెట్రోల్ బంకుల వద్ద హోర్డింగులను ఏర్పాటు చేసి ఓటు హక్కుపై ప్రచారాన్ని నిర్వహించాలని ఆయన కోరారు.

---------------------------

లోక్‌సభ ఎన్నికల కోసం తెలంగాణలో అదనంగా మరో 450 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 3 లక్షల మంది ఓటర్లు పెరిగిన నేపథ్యంలో అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అంతకు ముందు 35 వేల 356 కేంద్రాలుండగా... ఈసారి ఆ సంఖ్యను 35 వేల 806కు పెంచాలని ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు అనుమతి కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ప్రతిపాదనలు పంపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3 కోట్ల 31 లక్షల మంది ఓటర్లున్నారు. లోక్‌సభ ఎన్నికలు ఈఏడాది మే నెలలో జరగనున్నందున ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 22 వేల మంది ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. తొలిసారి ఓటు నమోదు చేసుకున్న అందరికీ ఫొటోతో కూడిన ఓటరు కార్డును పంపిణీ చేయాలని నిర్ణయించింది.

---------------------------

ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల కరపత్రాలు, పోస్టర్లలో ముద్రించే అస్పష్టమైన, రెచ్చగొట్టే అంశాలను తీవ్రంగా పరిగణిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరించింది. వాటిలోని విషయానికి పూర్తి బాధ్యత ప్రచురణ కర్తే వహించాలని స్పష్టం చేసింది. అందులోని అంశాలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఉండాలని సూచించింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కరపత్రాల ముద్రణపై ఆంక్షలను అమలు చేయాల్సిందిగా.. ఆయా రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారి, ప్రధాన కార్యదర్శిలకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసింది. వాటిపై తప్పనిసరిగా ప్రచురణకర్త పేరు ఉండాల్సిందేనని పేర్కొంది. అలా లేకుండా ఉన్నవాటిని వెంటనే తొలగించాలని స్థానిక, పురపాలక సంస్థలను ఈసీ ఆదేశించింది.

---------------------------

అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణే తమ ధ్యేయమని తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో నిన్న రాత్రి నిర్వహించిన "ప్రజాగళం" బహిరంగ సభలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి చంద్రబాబు నాయుడు ఉమ్మడి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని, పోలవరం సహా అన్ని ప్రాజెక్టులు పూర్తి కావాలని.. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకారం అవసరమని చెప్పారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ మే 13వ తేదీన ఎన్డీయే కూటమికి విజయం అందించాలని కోరారు. పరిశ్రమలు రాక యువతకు ఉద్యోగాలు లేవని, రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మిగలడం బాధాకరమని అన్నారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఉమ్మడిగా నిలబడాలని పిలుపునిచ్చారు.

---------------------------

మనం వేసే ఓటు మన భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బస్సు యాత్రలో భాగంగా నిన్న పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిడుగురాళ్లలో జరిగిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్

మోహన్ రెడ్డి మాట్లాడారు. తాను ముఖ్యమంత్రి అయ్యాక సచివాలయాలు తీసుకొచ్చి, 1 లక్ష 35 వేల ఉద్యోగాలు కల్పించానని చెప్పారు.

---------------------------

భారత్, చైనా మధ్య స్థిరమైన, శాంతియుత సంబంధాలు ఈ ప్రాంతానికే కాక... ప్రపంచానికీ కీలకమేనని భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సరిహద్దు అంశంలో ఇరు దేశాల మధ్య నెలకొన్న ప్రతిష్ఠంభన.. దౌత్య, సైనిక స్థాయిల్లో సానుకూల, నిర్మాణాత్మక చర్చల ద్వారా పరిష్కారం అవుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. న్యూయార్క్‌కు చెందిన 'న్యూస్ వీక్' మేగజీన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధానమంత్రి ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, భారత్‌లతో ఏర్పడిన క్వాడ్ కూటమి.. ఏ ఒక్క దేశానికీ వ్యతిరేకం కాదని అన్నారు. భారత్ ఎదుగుదలను ఎవరూ ఆపలేరని చెప్పారు. ఆర్థిక వ్యవస్థ పటిష్టమవుతోందని, దౌత్యపరంగా, శాస్త్రీయంగా, సైనికపరంగా ఎదుగుతున్న తీరు.. భారత్‌ను బలీయశక్తిగా నిలబెడుతోందని అన్నారు.

---------------------------

ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ దరఖాస్తుల గడువును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 20వ తేదీ వరకు పెంచింది. దీంతోపాటు అభ్యర్థులు తమ దరఖాస్తుల్లో తప్పులను సవరించుకునేందుకు ఎడిట్ ఆప్షన్ ఈరోజు నుంచి 20వ తేదీ వరకు అవకాశం కల్పించింది. టెట్ దరఖాస్తులకు గతంలో నిర్దేశించిన గడువు నిన్నటితో ముగిసింది. మంగళవారం నాటికి 1 లక్ష 93 వేల 135 దరఖాస్తులు వచ్చాయి. గత సంవత్సరం సెప్టెంబరులో నిర్వహించిన ఈ పరీక్షకు 2 లక్షల 91 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. దాంతో పోల్చితే ఈసారి దరఖాస్తులు భారీగా తగ్గడంతో ప్రభుత్వం అభ్యర్థులకు మరో అవకాశం ఇచ్చేందుకు గడువు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. వచ్చేనెల 20 నుంచి ఈ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

=====================